మానేపల్లి జ్యువెల్లర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన స్వర్ణగిరి ఆలయం, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

స్వర్ణగిరిలో.. కొలువుదీరిన వెంకన్న

- త్రిదండి చిన జీయర్‌స్వామి నేతృత్వంలో నిర్వహణ
- పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కుంభం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 6 : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని మానేపల్లి హిల్స్‌పై మానేపల్లి జ్యువెల్లర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రిదండి చినజీయర్‌స్వామి నేతృత్వంలో బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణలు, హోమాది క్రతువులతో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ చేపట్టారు. వారం రోజుల నుంచి వేద బ్రాహ్మణులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపార వేత్త శ్రీమాన్ మానేపల్లి రామారావు, వారి ధర్మపత్ని శ్రీమతి విజయ లక్ష్మి పుణ్య దంపతుల దివ్య సంకల్పానుసారముగా వారి కుమారులు శ్రీమాన్ మానేపల్లి మురళీకృష్ణ, శ్రీమాన్ మానేపల్లి గోపీకృష్ణ నేతృత్వంలో సుమారు 22 ఎకరాల ప్రాంగణంలో అత్యంత సుందరంగా నిర్మించిన ఈ ఆలయానికి 'స్వర్ణగిరి' అని నామకరణం చేశారు. కొండపై శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శ్రీ పాంచరాత్ర ఆగమ, తెన్నాచార్య సంప్రదాయమును అనుసరిస్తూ, ప్రాచీన శిల్ప శాస్త్ర రీతులను అవలంభిస్తూ సువిశాలముగా యాదాద్రి తిరుమల దేవస్థానం పేరుతో రూపుదిద్దుకున్నది.

రాష్ట్రపతి నిలయంలో.. చేనేత, హస్తకళ ప్రదర్శన

రాష్ట్రపతి నిలయంలో చేనేత, హస్తకళ ప్రదర్శనను ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, తదితరులు

బొల్లారం, మార్చి 6 : బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళ ప్రదర్శనను బుధవారం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ప్రదర్శనలు ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిలయం అధికారి రజనీ ప్రియ తెలిపారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హెరిటేజ్ సారీ వాక్, లిటరరీ ఫెస్టివెల్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా మేజర్ జనరల్ రాకేశ్ మనోచా, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.అశోక్, నిలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓం నమో నమ శివాయ గీతావిష్కరణ

గేయాన్ని ప్రారంభిస్తున్న చంద్రబోస్

ఖైరతాబాద్, మార్చి 6 : మహాశివరాత్రి సందర్భంగా జగిత్యాల జిల్లా రాజారం గ్రామానికి చెందిన యువ రచయిత్రి గాయత్రి దేవరకొండ రచించిన 'ఓం నమో నమ శివాయ' గీతాన్ని సోమాజిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఆవిష్కరించారు.

లోక్ సభ ఎన్నికల్లో మాదిగలకు 3సీట్లు కేటాయించాలి

రవీంద్రభారతి, మార్చి 6 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వరంగల్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ సీట్లు మాదిగలకు కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ డిమాండ్ చేశారు. మాదిగ యువసేన కో-ఆర్డినేటర్ మంచాల యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీఎస్ఆర్ పద్ధతిలో.. చెరువుల అభివృద్ధి

- పారిశుద్ధ్యం, అడ్వర్టైజ్‌మెంట్‌పై రెండు అడ్‌హక్ కమిటీలు
- నగరాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి
- స్టాండింగ్ కమిటీ తొలి సమావేశంలో 14 అంశాలకు ఆమోదం
- నగరాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి
- స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ విజయలక్ష్మి

యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌తో జీహెచ్ఎంసీ ఎంఓయూ

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్, కమిటీ సభ్యులు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులకు మేయర్ సాదరంగా స్వాగతం పలికి మొక్కలను అందజేశారు. అనంతరం అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. స్టాండింగ్ కమిటీకి అత్యంత ప్రాముఖ్యత ఉన్నదని మేయర్ అన్నారు. నిర్మాణాత్మక, ప్రజోపయోగమైన నిర్ణయాలు తీసుకొని నగరాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆవుల రవీందర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కంది శైలజ, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, చింతల విజయశాంతి, పొడవు అర్చన, ఫహ్లాద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, బన్నాల గీత ముదిరాజ్, మన్నె కవితారెడ్డి, మహమ్మద్ ఖాదీర్, మహమ్మద్ నసీరుద్దీన్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, రఫత్ సుల్తానా, షహీన్ బేగం, సబీహ బేగం పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాల్లో ప్రధానమైనవి

- జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్యం, అడ్వర్టైజ్‌మెంట్‌పై రెండు అడ్‌హక్ కమిటీల ఏర్పాటు
- తదుపరి స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రతి గురువారం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది.
- జీహెచ్ఎంసీలో ప్రాపర్టీ, యుటిలిటీల గుర్తింపునకు జీఐఎస్ బేస్ట్ సర్వే మ్యాపింగ్ అమలుకు ఆమోదం
- కూకట్‌పల్లి మండలం ఎల్లమ్మ చెరువు నుంచి డ్రైనేజీ గతంలో ప్రతిపాదించిన 1200 ఎంఎం డయా పైపులైన్‌కు మొత్తం రూ.274 లక్షల మంజూరుకాగా అవే నిధులతో 1600 ఎంఎం పైపులైన్ వేసేందుకు ఆమోదం.
- నానక్‌రాంగూడ రంగలాల్‌కుంట అభివృద్ధి, హఫీజ్‌పేట్ కొత్తకుంట చెరువు అభివృద్ధి, మూసాపేట ముళ్ల కత్వ చెరువు అభివృద్ధి, గచ్చిబౌలి బర్లకుంట చెరువు పునరుద్ధరణ, కొత్తగూడ నేరెళ్లకుంట చెరువు పునరుద్ధరణ, నిర్వహణ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ పద్ధతిలో సీఎస్ఆర్ కింద ఎంఓయూ కుదుర్చుకున్నారు.
- మూసారంబాగ్ మూసీ నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అలీకేఫ్, అంబర్‌పేట నుంచి ముసారంబాగ్ స్పైస్ రెస్టారెంట్ వరకు, అలీ కేఫ్ ఎక్స్‌రోడ్ అంబర్‌పేట్ నుంచి ముసారంబాగ్ బ్రిడ్జి, అజామాబాద్ డివిజన్‌కు యుటిలిటీల షిఫ్టింగ్‌కు అంచనా వ్యయం మొత్తం రూ.3,97,32,391లకు పరిపాలన అనుమతికి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదించింది.
- ఎల్బీనగర్ సర్కిల్ బైరమల్‌గూడ చెరువు నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు వర్షపు నీటి కాలువ నిర్మాణానికి రివైజ్డ్ అంచనా మేరకు రూ.588 లక్షలకు అదనంగా రూ.10.52 లక్షలకు కమిటీ ఆమోదం

మహిళలు రాణించాలి

బంజారాహిల్స్ రోడ్ నెం 12లో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్, మార్చి 6 : జీహెచ్ఎంసీ సర్కిల్- 18 టౌన్‌లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.12 లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, డీఎంసీ ప్రశాంతి తదితరులున్నారు.

సీసీఎంబీ సైంటిస్ట్‌కు సన్ ఫార్మా ఫెలోషిప్

సిటీబ్యూరో, మార్చి 6(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయోలజీలో సీనియర్ సైంటిస్ట్‌గా సేవలందిస్తున్న సంతోష్ చౌహాన్ సన్ ఫార్మా సైన్స్ ఫౌండేషన్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపిక య్యారు. క్యాన్సర్, కొవిడ్, జీకాతోపాటు, చికెన్ గున్యా వంటి వైరస్ వ్యాధులపై ఆయన చేసిన పరిశోధనలకు గాను ఈ ఫెలోషిప్‌నకు ఎంపిక చేసింది.

మహిళా ప్రముఖులకు పురస్కారాలు



పురస్కారగ్రహీతలలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ముషీరాబాద్, మార్చి 6 : చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరై వివిధ రంగాలలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు మహిళలకు పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాన సభ పాలక మండలి సభ్యురాలు భమిడి ఉష, లలిత, శ్రీమణి, శోభారాణి తదతరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు

సిటీబ్యూరో, మార్చి 6(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్లు లేదా ఇండ్ల స్థలాలను అందిస్తామని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్)డైరీని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, ఉపాధ్యక్షులు దామోదర, నాగవాణి, రమేశ్, వీరేశ్, విజయ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బండ ప్రకాశ్‌పై ఆరోపణలు సరికాదు

- పదిరోజుల్లో క్షమాపణ చెప్పాలి
- ముదిరాజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యదర్శి ప్రొఫెసర్ రాములు

ఖైరతాబాద్, మార్చి 6 : తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్‌పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ముదిరాజ్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ప్రొఫెసర్ నీల రాములు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మండుల వరలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బోళ్ల వెంకట్ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడారు. నాడు రాజ్యసభ సభ్యులుగా ఉన్న డాక్టర్ బండ ప్రకాశ్ ఎంపీ నిధుల నుంచి మంజూరు చేసిన కోటి రూపాయలతో ఆత్మగౌరవ భవనం పనులు ప్రారంభించారన్నారు. కానీ ముదిరాజ్ మహా సంఘం పేరుతో ఓ నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అది సరికాదన్నారు. ప్రస్తుతం ఆరోపణలు చేస్తున్న వారు నాడు ఆత్మగౌరవ భవనం భూమి పూజలో పాల్గొన్నారని తెలిపారు. డాక్టర్ బండ ప్రకాశ్‌పై ఆరోపణలు చేస్తే సహించేది లేదని, పదిరోజుల్లో క్షమాపణ చెప్పకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలోతెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.యాదగిరి, కోశాధికారి బి.సత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కనకయ్య, కార్యదర్శులు జి.స్వామి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షుడు మల్లేశం, డి.కృపాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 6 : ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎమ్మెస్సీ ఆడియాలజీ, ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథాలజీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఎస్ - ఎంఎస్ మొదటి, మూడు, 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

హాకీ సీనియర్ ఉమెన్ నేషనల్స్‌కు.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని

హయత్‌నగర్, మార్చి 6 : ఈనెల 14 నుంచి పూణేలో జరుగనున్న హాకీ సీనియర్ ఉమెన్ నేషనల్స్‌కు తెలంగాణ నుంచి హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం మొదటి సంవత్సరం విద్యార్థిని పి.మీనా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పి.మీనాను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోత్స్న ప్రభ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధ్యాపకులు అభినందించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రోడ్డెక్కిన గృహజ్యోతి

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన

కుత్బుల్లాపూర్, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గృహజ్యోతి' పథకంలో భాగంగా జీరో కరెంటు బిల్లు కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాదాపు గంటపాటు ఆందోళన చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో డీసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. దీంతో జీడిమెట్ల పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న లబ్ధిదారులను శాంతింపచేశారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత ఆయా వార్డు కార్యాలయాల్లో వివరాలను నమోదు చేస్తున్నారని సూచించడంతో వార్డు కార్యాలయాలకు వెళ్లారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. గడిచిన కొన్ని రోజులుగా పాఠశాలలు, వాణిజ్య సముదాయాలలో మాక్ డ్రిల్ చేపట్టి అవగాహన పెంచుతున్నామన్నారు. మియాపూర్ డీమార్ట్, సికింద్రాబాద్ చెన్నై షాపింగ్‌మాల్, అత్తాపూర్ నారాయణి షాపింగ్ మాల్, కూకట్‌పల్లి చెన్నై స్కిల్స్, కొత్తపేట శ్రీలక్ష్మీ వైట్ హౌస్ టెక్స్‌టైల్‌తో పాటు 58 చోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 32 పబ్లిక్ ప్రాంతాలు, 15 షాపింగ్ కేంద్రాలు, 7 స్కూల్స్, కాలేజీలు, అపార్ట్‌మెంట్లు, హాస్టల్స్‌లో వారం రోజుల వ్యవధిలో ఈ అవెర్నెస్ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈవీడీఎం సేవలపై 040-2955 5500, 9000113667 వాట్సాప్ చేయాలన్నారు.

గాంధీలో అరుదైన వైద్యం

- ఎనిమిది ఏండ్ల చిన్నారి ఛాతిలోని కణతి తొలగింపు
- వైద్య సిబ్బందిని అభినందించిన డా.రాజారావు

ఆపరేషన్ నిర్వహించిన పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్ నాగార్జున, వైద్యుల బృందం

బన్సీలాల్‌పేట్, మార్చి 6 : గాంధీ దవాఖానలో ఎనిమిది ఏండ్ల చిన్నారికి అరుదైన, అత్యంత క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా, బైరామల్‌గూడకు చెందిన మైథిలి అనే బాలిక(8) గత రెండేండ్ల నుంచి ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నది. సిటీ స్కాన్, ఇతర పరీక్షలు నిర్వహించగా, ఛాతిలో ఊపిరి తీసుకునే వాహిక, అన్నవాహికల నడుమ కణతి ఉన్నట్టు గుర్తించారు. దీంతో గాంధీ దవాఖానలోని పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో చేర్పించగా, హెచ్ఓడీ, ప్రొఫెసర్ కె.నాగార్జున ఈ కేసును ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మనోజ్, డాక్టర్ ఆశ్రిత్‌రెడ్డి, డాక్టర్ హర్ష, డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ నేహ, అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆవుల మురళి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రవినాయక్, సిబ్బంది కలిసి 2డిలో కనిపించే థెరాకోస్కోపి ద్వారా సమీక్షిస్తూ, రెండు గంటలపాటు శ్రమించి, విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు మాట్లాడుతూ ఎంతో శ్రమించిన ఆపరేషన్‌ను విజయవంతం చేసిన పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్యులను, సిబ్బందిని అభినందించారు. పాప ప్రస్తుతం కోలుకుంటున్నదని, రెండు రోజుల్లో డిశ్చార్జీ చేస్తామని తెలిపారు. గాంధీ దవాఖానలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్యం అందించడానికి అనువైన అన్ని సదుపాయాలు, చక్కటి వార్డులు, అనుభవం కలిగిన వైద్యులు, చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నదని పేర్కొన్నారు.

రోడ్డుపై వ్యర్థాలు.. జ్యువెల్లరీకి రూ.50వేలు జరిమానా

- మోండా మార్కెట్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన
- ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారులకు సూచన

మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, తదితరులు

మారేడ్‌పల్లి, మార్చి 6 : మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ బుధవారం ఉదయం జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మోండా మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను వ్యాపారులు, స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మోండా మార్కెట్, పాట్ మార్కెట్, పాలికాబజార్, 31వ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని అన్నారు. మార్కెట్‌లో వ్యాపారులందరూ వ్యర్థాలను రోడ్లపై వేయకూడదని, నిబంధలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓ బంగారు దుకాణం యజమాని వ్యర్థాలను రోడ్డుపై వేయడంతో రూ.50 వేలు జరిమానా విధించాలని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అదేవింగా మార్కెట్‌లోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న మూత్రశాలలకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ 31వ బస్టాండ్ వద్ద ఉన్న మూత్రశాలలను తొలగించి ఆ ప్రాంతంలో గ్రీనరీని ఏర్పాటు చేయాలని, ప్రజల సౌకర్యార్థం పక్కనే ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మార్కెట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి అల్పా హోటల్ వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్, రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు అక్రమించుకొని వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ సమయ్య, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆంజనేయులు, ఏఈ రవీందర్, ఏసీపీ కృష్ణఫర్, డీఈ ఎస్‌డబ్ల్యూఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణ

కాచిగూడ, మార్చి 6 : కేంద్ర ప్రభుత్వ అమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతీ, యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. కాచిగూడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీర్, పాలిటెక్నిక్, డిప్లొమా యువకులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7893141797, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

10న కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో ఓపెన్‌హౌజ్

బేగంపేట్, మార్చి 6 : బేగంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో ఈ నెల 10వ తేదీన ఓపెన్ హౌజ్ నిర్వహిస్తున్నట్లు కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. 10వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఓపెన్ హౌజ్ ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి ఐఐసీటీలో అంతర్జాతీయ సదస్సు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఆర్గానిక్ సింథసిస్, సహజ ఉత్పత్తుల్లో ఉండే వైద్య రంగానికి ఉపయోగపడే రసాయన గుణాలపై అంతర్జాతీయ సదస్సుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ వేదిక కానున్నది. గురువారం ప్రారంభమయ్యే ఈ సింపోజియం మార్చి 9వరకు జరుగనున్నది. నేచర్ ఇన్‌స్పైర్డ్ ఇనిషియేటివ్ ఇన్ కెమికల్ ట్రెండ్స్ పేరిట నిర్వహించనున్న ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్, కెమికల్ రంగంలోని ఆధునాతన సాంకేతికతపై విస్తృతంగా చర్చించనున్నారు. ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో ప్రారంభ వేడుకలను నిర్వహించనుండగా, మూడ్రోజుల సింపోజియంలో టెక్నికల్ సెషన్లు, నిపుణులతో చర్చాగోష్ఠి జరుగతుందని నిర్వాహకులు తెలిపారు.